క్లుప్తంగా

పేరంటాలమ్మకు ఆషాఢం సారె సమర్పణ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తొలి సారెను ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా భానుతో పాటు సభ్యులు తొలుత ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి మహిళా సభ్యులు పసుపు, కుంకుమ, పండ్లు, గాజులతో పాటు సారెను అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో అమ్మవార్లకు సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయంలో ఈ నెల రోజులు ప్రత్యేక పూజలతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు



కంకిపాడు: వర్షాకాలం కారణంగా కంకిపాడు పట్టణంలో పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు మంగళవారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఓ.రామకృష్ణ పర్యవేక్షణలో డ్రెయిన్లలో పూడిక తీత పనులు నిర్వహించారు. రహదారులపై చెత్త, వ్యర్థాలను తొలగించారు. దోమల నిర్మూలనకు దోమల మందు ఫాగింగ్ చేయించారు. దోమల నిర్మూలనకు ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్అధికారి శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నివీర్ పథకంపై అవగాహన



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ జవహర్ నవోదయ విద్యాలయలో అగ్నివీర్ పథకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ నాన్ కమిషన్డ్ ఆఫీసర్ సందీప్ హాజరై విద్యార్థులకు అగ్నివీర్ పథకంపై అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వం అగ్నివీర్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఆవశ్యకతను వివరించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరిహద్దు వివాదంలో ఘర్షణ



చికిత్స పొందుతున్న శోభన్‌బాబు

కంకిపాడు: సరిహద్దు వివాదం ఘటన ఘర్షణకు దారితీసింది. టీడీపీ మండల నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర, అతని అనుచరులు దాడికి తెగబడ్డారని, తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందంటూ ఓ కుటుంబం కంకిపాడు పోలీసులను ఆశ్రయించింది. బాధిత కుటుంబం కంకిపాడు పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని కోలవెన్ను శివారు క్రిస్టియన్‌పేటకు చెందిన జుజ్జవరపు వరమ్మ, ఆమె కుమారుడు శోభన్‌బాబు, ఇతర కుటుంబ సభ్యులు ఇంటి వెలుపలికి వచ్చే క్రమంలో జగన్నాథపురానికి చెందిన టీడీపీ మండల నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర అతని అనుచరులతో కలిసి వచ్చి తన స్థలంలో పైపులైను ఎందుకు వేశారంటూ దుర్భాషలాడుతూ ఘర్షణకు దిగారు. వరమ్మ కుటుంబ సభ్యులను ఇష్టానుసారంగా తిట్టారు. ఈ క్రమంలో తలెత్తిన ఘర్షణలో వరమ్మ కుమారుడు శోభన్‌బాబుకు చేతి వేలు విరిగింది. విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించారు. అసభ్యపదజాలంతో రవీంద్ర, అతని అనుచరులు బీభత్సం సృష్టించారని, ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జుజ్జవరపు వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ డి.సందీప్‌ను వివరణ కోరగా సుదిమళ్ల రవీంద్ర వర్గం కూడా ఈ ఘటనపై ఫిర్యాదు చేసిందన్నారు. స్థలాన్ని ఆక్రమించి పైపులైను నిర్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, ఘటనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గుంతలమయంగా కానూరు ప్రధాన రహదారి

- రోడ్డు పైనే మురుగు నీరు పారుదల
- డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని ప్రజల వినతి



రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీరు

పెనమలూరు: కానూరు గ్రామ ప్రధాన రహదారి గుంతలతో ప్రజలకు నరకం చూపిస్తుంది. వర్షం పడితే రోడ్డుపై భారీగా మురుగునీరు చేరుతుంది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే కానూరు ప్రధాన రహదారి కామయ్య తోపు నుంచి కానూరు గ్రామం వరకు ఉంది. ఈ రహదారి బందరు రోడ్డుకు ప్రసాదంపాడు వరకు ఏలూరు రోడ్డుకు లింకు రోడ్డుగా ఉంది. కానూరు గ్రామం గత 15 ఏళ్లలో ఊహించని విధంగా అభివృద్ధి చెందింది. స్థిర నివాసాలు విపరీతంగా పెరిగాయి. గ్రామ జనాభా కూడా దాదాపు 70 వేల వరకు ఉంది. కానూరు నుంచి బందరు రోడ్డుకు రావాలన్నా, ఏలూరు రోడ్డు వెళ్లాలన్నా ఈ ప్రధాన రహదారిపై ప్రయాణం చేయాల్సి ఉంది. అయితే ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. సీఆర్డీఏ ఈ రోడ్డు అభివృద్ధికి గతంలో ప్రణాళిక రూపొందించినా ఆచరణలో రోడ్డు వేయలేదు. దీంతో రోడ్డు గుంతలు పడి ప్రయాణించటానికి వీలు లేకుండా ఉంది. రెండేళ్ల క్రితం మున్సిపాలటీ రోడ్డు ప్యాచ్ వర్కు చేసింది. అయితే వర్షాల కారణంగా మరలా రోడ్డు పూర్తిగా గుంతలు పడిపోయాయి.

భారీ వాహనాలతో సమస్య

కానూరుకు ఆటోనగర్ పక్కనే ఉండటంతో భారీ వాహనాలు కానూరు ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తాయి. భారీ వాహనాలు వెళ్లటం వలన రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కానూరు మీదగా భారీ వాహనాలు వెళ్లకుండా అధికారులు నిషేధించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ రోడ్డుపై



గుంతలు పడిన రహదారి

తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామాల నుంచి భారీ వాహనాలు వెళ్లటానికి అనుమతులు ఎలా ఇచ్చారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి..

కానూరు ప్రధాన రహదారి నిర్మాణంపై వెంటనే ప్రభుత్వం స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కానూరు గ్రామం నుంచి సీఆర్డీఏకు భవనాల నిర్మాణానికి సంబంధించి రూ.కోట్లాది సొమ్ము సమకూరుతున్నందున సీఆర్డీఏ రహదారి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు విస్తరించి టూవే రోడ్డుగా పటిష్టంగా అభివృద్ధి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రెయినేజీలు నిల్..

కానూరు ప్రధాన రహదారి ఇరువైపులా డ్రెయినేజీలు లేకపోవటంతో తీవ్ర సమస్యగా ఉంది. వర్షం చినుకు పడితే మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉంటుంది. దీంతో రహదారిపై నడవలేని పరిస్థితి. మురుగునీరు రోడ్డుపై నిలిచి పోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లి, వ్యాధులు ప్రబలుతున్నాయి.గతంలో టీడీపీ పాలనలో గ్రామంలో పూర్తి స్థాయిలో డ్రెయినేజీలు నిర్మాణం చేయటానికి సర్వే చేశారు. ఆ తరువాత పనులు ముందుకు సాగలేదు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం



కంకిపాడు ప్రధాన సెంటర్‌లో ఫర్నిచర్ ధ్వంసం చేస్తున్న యువకుడు

కంకిపాడు: వైఎస్సార్ సీపీ కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ఆగంతకుడు ధ్వంసం చేసిన ఘటన మండల కేంద్రమైన కంకిపాడులో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన యువకుడు మద్యం సేవించి పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో చొరబడి కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్‌ను నడిరోడ్డుపై పడేసి కుర్చీలను విరగ్గొట్టాడు. అదేమని ప్రశ్నించిన స్థానికులపైనా దురుసుగా ప్రవర్తించాడు. ఈ వ్యవహారంలో పట్టణానికి చెందిన కొందరు వ్యక్తుల ప్రోత్సాహం ఉన్నట్లు స్పష్టమవుతుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఫర్నిచర్ ధ్వంసం ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని జేసీఎస్ మండల మాజీ చైర్మన్, కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడులు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. సమావేశంలో అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మేదంద్రావు కుటుంబరావు, జొన్నలగడ్డ నాగేశ్వరరావు, కె.మరియబాబు, బాకీ రాజు, చంటి పాల్గొన్నారు.

ధ్వంసం వెనుక ఎమ్మెల్యే బోడె అనుచరుల హస్తం

కంకిపాడు: కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం వెనుక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అనుచరుల హస్తం ఉందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ పట్టణానికి చెందిన యువకుడు సింహా మద్యం సేవించి వైఎస్సార్ సీపీ కార్యాలయ ఫర్నీచర్ మంగళవారం ధ్వంసం చేశాడన్నారు. కొద్ది రోజులుగా ఆ యువకుడు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో సన్నిహితంగా తిరుగుతున్నాడని, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మెప్పు కోసం కొందరు అనుచరులు ఈ ధ్వంసరచనకు రెచ్చగొట్టారని ఆరోపించారు. ప్రజలు అధికారం ఇచ్చింది అభివృద్ధి చేయటానికని గుర్తుచేశారు. దాడులు పునరావృతం అయితే సహించేది లేదని స్పష్టంచేశారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

రామవరప్పాడు: రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకుని రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని ఏసీపీ ఎం.జనార్దన్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు 24కే కల్యాణ మండపం వద్ద మంగళవారం పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదేశాల మేరకు 'హెల్మెట్ వినియోగం ఆవశ్యకత'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారే మృత్యువాత పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్‌లను వినియోగించాలని సూచించారు. అనంతరం 'హెల్మెట్ ధరించండి- రక్షణ పొందండి', తల మీదే - రక్షణ మీదే అన్న నినాదాలతో హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు జీవీవీ సత్యనారాయణ, ఎస్.ఆదినారాయణ, సబ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సిబ్బంది, ఎస్సార్కే కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలకు అనుగుణంగా పాలన



పెనమలూరు: ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పాలన సాగుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీకి అనుగుణంగా పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక విధానం అమలుచేయటం జరిగిందన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం స్టాక్ యార్డులలో నిల్వ ఉన్న ఇసుకను ప్రజలకు అందించాలన్నారు. శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న అమరావతికి ఇసుక డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలపై ప్రభుత్వం కక్ష సాధింపు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగింది. ఏడాదిన్నర క్రితం స్థానిక టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి ఘటనపై పోలీసులు ఇప్పుడు చర్యలకు ఉపక్రమించారు. అప్పట్లోనే నమోదైన కేసులో 45 మందికిపైగా నిందితులుగా పేర్కొనగా కొత్తగా మరి కొంత మంది పేర్లను చేర్చారు. సోమవారం అర్ధరాత్రి నుంచి వైఎస్సార్ సీపీ నేతల అక్రమ అరెస్టుల పర్వాన్ని పోలీసులు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో ప్రమేయం లేని నేతల పేర్లను కూడా ఈ కేసులో చేర్చడం టీడీపీ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్టగా చెప్పవచ్చు. 2023 ఫిబ్రవరి 20న టీడీపీ నేతల రెచ్చకొట్టే వ్యాఖ్యలు, సవాళ్ల కారణంగా గన్నవరంలో అలజడులు చెలరేగాయి. వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతల పరస్పరం దాడులు చేసుకున్న ఈ ఘటనలో టీడీపీ ఆఫీస్ ధ్వంసమైంది. అప్పట్లోనే టీడీపీ, వైఎస్సార్ సీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులోని నిందితులకు 41 సీఆర్పీ కింద నోటీసులు ఇచ్చి విచారించారు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌తో పాటు వైఎస్సార్ సీపీ నేతలపై కక్ష సాధించేందుకు ఈ కేసును తెర మీదకు తీసుకువచ్చింది. ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన సూచనల మేరకు ఈ కేసులో నిందితులుగా ఉన్న 45 మందితో పాటు ఈ ఘటనతో సంబంధం లేని పార్టీలోని కీలక వ్యక్తుల పేర్లు కొత్తగా ఈ కేసులో చేర్చుతున్నారు.

కొనసాగుతున్న అరెస్టులు..

స్థానిక సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులతో పాటు జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నుంచి వచ్చిన ప్రత్యేక పోలీస్ బలగాలతో అరెస్టులు ప్రారంభించారు. ఇప్పటికే తిప్పనగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్‌ను, కేసరపల్లి గ్రామానికి చెందిన మరో ముగ్గురిని సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ నాయకులు కొల్లి సుబ్రహ్మణ్యం, అల్లాపురం సర్పంచ్ డొక్కు వెంకన్నబాబు, వర్తక సంఘానికి చెందిన పడమట నాగరాజు, మరో పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మిగిలిన వారి కోసం పలు బృందాలుగా గాలింపు చేపట్టారు. అయితే ప్రభుత్వం అనుసరిస్తున్న వేధింపు చర్యలను వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రాభివృద్ధి, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం దుర్మార్గమన్నారు.

విచారణ చేస్తున్నాం : డీఎస్పీ జయసూర్య

టీడీపీ ఆఫీస్‌పై దాడి ఘటనపై నమోదైన కేసులో విచారణ చేస్తున్నాం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నాం. వీటి ఆధారంగా ఈ కేసులో ముందుకు వెళ్తున్నాం.

గ్రామాల్లో అడుగంటిన చెరువులు



పి.నైనవరం గ్రామంలోని చెరువులో తగ్గిన నీటి నిల్వలు

విజయవాడరూరల్: గ్రామాల్లోని చెరువుల్లో నీరు లేక అడుగంటి పోతున్నాయి. దీంతో చెరువుల ఆయకట్టులో వ్యవసాయ భూముల ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ వరినాట్లు వేసేందుకు నారుమళ్లు సిద్ధమవుతుండగా చెరువుల్లో నీరు లేకపోవడంతో నాట్లు వేయలేక మదన పడుతున్నారు. కుందావారి కండ్రిక, నున్న, పాతపాడు గ్రామాల రైతుల ఆయకట్టు భూములున్న రైతులకు కుండోడు చెరువు నుంచి వరినాట్లకు అవసరమైన నీరు అందుతుంది. కానీ చెరువులో నీరు లేదు. అదే విధంగా పాతపాడు గ్రామంలో సుబ్బన్న చెరువు, ఎర్ర చెరువు, పి.నైనవరం గ్రామంలో కుక్కలవాని చెరువు, ఎర్ర చెరువుల్లో నీరు లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో ఉన్న అరకొర నీటిని మోటార్లు పెట్టి నారుమళ్ల కోసం తోడుతున్నారు. వందలాది ఎకరాల చెరువు ఆయకట్టు భూములకు అవసరమైన సాగు నీరు లేకుండా సాగు చేసేది ఎట్లా అన్ని రైతాంగం అంటున్నారు. పట్టిసీమ నుంచి పోలవరం కాల్వకు నీరు వస్తున్న నేపథ్యంలో మోటార్లు పెట్టి చెరువులను నింపితే తప్ప ఖరీఫ్ సీజన్‌కు వరినాట్లు పడే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

విద్యార్థినులకు బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందుకున్న విద్యార్థినులతో గంగాధరరావు, హెచ్‌ఎం ఝున్సీలక్ష్మి

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పట్టణ యాదవ సంఘం నాయకులు చిమట గంగాధరరావు రూ.12 వేలు ఆర్థిక సౌజన్యంతో ఆర్టీసీ పాస్‌లు పంపిణీ చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో గంగాధరరావు చేతుల మీదుగా 200 మంది విద్యార్థినులకు బస్‌పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు తోడ్పాటునందించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినుల కుటుంబాలపై ఆర్థిక భారం లేకుండా బస్‌పాస్‌లు జారీకి అయ్యే ఖర్చును ఆర్టీసీకి తాను చెల్లించానని తెలిపారు. భవిష్యత్‌లో విద్యార్థులకు మరింత సాయం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఝున్సీలక్ష్మి, ఆర్టీసీ సిబ్బంది గొరిశెట్టి హనుమంతరావు, వాసు, జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్

గన్నవరం: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని వి.ఎ స్.సెయింట్‌జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జాతీయ విద్యా, మానవ వనరుల అభివృద్ధి సంస్థ నిర్వహించిన స్వచ్ఛభారత్‌పై చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 7వ తరగతి విద్యార్థి జి.స్వయాన్ జాతీయ స్థాయి అవార్డు సాధించాడని తెలిపారు. మరో 13 మంది రాష్ట్ర స్థాయి ప్రతిభా పతకాలను, 18 మంది ప్రోత్సాహక పతకాలను పొందారన్నారు. విద్యార్థులలోని సృజనకు పదును పెడితే ఏ రంగంలోనైనా నైపుణ్యాన్ని సాధించడం సులభమని నిరూపించారని తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన డి.శ్రీనివాసరావును ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది. సీనియర్ బ్రదర్లు జిమ్మీకురియోకోస్, భల్లాజోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులు



తేలప్రోలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

ఉంగుటూరు: అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు అందజేస్తామని తహసీల్దార్ జె.సుబ్బారావు తెలిపారు. తేలప్రోలు రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతు గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కౌలు రైతులు సంబంధిత పత్రాలతో గ్రామ రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందటం వలన అన్నదాత సుఖీభవ, వ్యవసాయ రుణాలు, ఈ క్రాప్ నమోదు, పంటను విక్రయించుకొనేందుకు, పంట నష్టం సాయం పొందవచ్చన్నారు. అన్ని రకాలుగా కౌలు రైతులకు ఉపయోగకరంగా ఉన్న గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లాం దిబోర, వీఆర్వో అట్లూరి సునీల్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ఉద్యాన శాఖాధికారి చందు జోసఫ్ సుందరం



చలివేంద్రపాలెంలో మాట్లాడుతున్న చందు జోసఫ్ సుందరం

కంకిపాడు: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని కంకిపాడు ఉద్యాన శాఖాధికారి చందు జోసఫ్ సుందరం అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు, చలివేంద్రపాలెం గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఉద్యాన శాఖాధికారి చందు జోసఫ్ సుందరం మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన రైతులకు ప్రభుత్వ రాయితీలు అందుతాయన్నారు. ఆయిల్ పామ్ పంట అత్యధికంగా దిగుబడి ఇచ్చే దీర్ఘకాలిక పంట అన్నారు. పామాయిల్ ఇతర చమురు పంటల కంటే తక్కువ ఉత్పత్తి ఖర్చులను కలిగిన పంట అని, ఆయిల్‌పామ్ సాగుకు ఈ ప్రాంతం అనువైనదని చెప్పారు.

100 శాతం రాయితీ..

ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలని, మొక్కలకు అయ్యే ఖర్చు 100 శాతం రాయితీ రైతులకు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఏటా నాలుగేళ్ల పాటు సస్యరక్షణ, మందులకు అయ్యే ఖర్చులో 50 శాతం రాయితీ అందిస్తారన్నారు. అంతర పంటలుగా కూరగాయలు, పసుపు, కంద, బొప్పాయి, అరటి, మినుము పంటలను వేయటం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆయిల్ పామ్ సాగు రైతులకు ఉపాధి హామీ కూలీలతో పొలాల్లో గుంతలు, కలుపు తీయటం, మొక్కలు వేయించటం, ఎరువులు వేయటం వంటి పనులను చేయించుకోవచ్చని చెప్పారు. పతంజలి ఫుడ్స్ పామ్ ప్లాంటేషన్ మేనేజర్ శరత్‌బాబు మాట్లాడుతూ 10-16 నెలల వయసు గల మొక్కలను తమ సంస్థ సరఫరా చేస్తోందన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన ఆయిల్‌పామ్‌ను అంబాపురంలోని ప్రాసెసింగ్ యూనిట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తామని, ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో చలివేంద్రపాలెం సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, ఉద్యాన సహాయకురాలు ధాత్రికారాణి, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు



పీఆర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం: పంచాయతీరాజ్ శాఖలోని పెండింగ్ సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. ఈ మేరకు విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్త రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలంలో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. రంగయ్య అప్పారావుకు వెళ్లే రోడ్డు పునర్నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. పంచాయతీరాజ్ డీఈ పి.సురేష్, పీఐయూడీ భవాని, ఏఈలు డి.జయరాజు, సీహెచ్ దాసు పాల్గొన్నారు.